క్లుప్తంగా

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణా: మండలంలోని నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ నిజాముద్దీన్, ఎస్ఐ ఎండీ నవీద్‌లు సూచించారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు తీర ప్రాంత ప్రజలు వరదల నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఎగువన కృష్ణానదిపై ఉన్న కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి అత్యధికంగా నీళ్ల దిగువకు విడుదల చేస్తుండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు. అదే విధంగా వారం రోజులుగా మండలంలో అత్యధిక స్థాయిలో వర్షాలు కురుస్తుండడంతో ఆయా గ్రామాల అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఎప్పటికప్పుడు గ్రామాల పూర్తి సమాచారం తీసుకుంటున్నట్లు తెలిపారు.

వరుసగా ద్విచక్రవాహనాల చోరీ



కృష్ణా: మండలంలో ఇళ్లముందు నిలిపిన వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించే దొంగలబెడద రోజురోజుకు పెరుగుతోంది. శనివారం రాత్రి చేగుంట గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్‌కు చెందిన ద్విచక్రవాహనం, రెండు రోజుల క్రితం అదే గ్రామంలో పీఆర్ ఆహ్మద్‌కు చెందిన బైక్‌ను అపహరించారు. హిందుపూర్ గ్రామంలోని ఈశన్నగౌడ్‌కు చెందిన బైక్‌ను వారం రోజుల క్రితం చోరీ చేశారు. ఇలా ఇంటిముందు ఆపిన ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్నారు. కేవలం షైన్ బైక్‌లను మాత్రమే అపహరించడానికి, అవి తక్కువ శబ్దం వస్తాయని, చోరీకి వీలుంటుందని దొంగలు వాటిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పోలీసులు రాత్రి సమయంలో గస్తీ తిరగాలని, దొంగల బెడద నుంచి రక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ ఎండీ నవీద్‌ను వివరణ కోరగా ఈ విషయంపై తాము విచారణ చేస్తామని, దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థికి సన్మానం



దామరగిద్ద: పేద విద్యార్థి క్రీడల్లో తనకున్న ప్రతిభతో కరీంనగర్ క్రీడాపాఠశాలలో సీటు సంపాదించడంతో జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు రామన్న, వింటో అధ్యక్షుడు ఈదప్పలు అభినందించారు. విద్యార్థి మంచి క్రీడా స్ఫూర్తితో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మిల్కాసింగ్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్, జాతీయ కబడ్డీ కోచ్ వెంకటప్ప, కోచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కార్యవర్గం ఎన్నిక



కోస్గి రూరల్: గతంలో వాలీబాల్ అంటేనే కోస్గి మండలానికి జిల్లా ప్రత్యేక స్థానం ఉండేదని, పూర్వ వైభవం తీసుకొచ్చేందుకే నూతన మండల వాలీబాల్ అసోసియేషన్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు వార్ల విజయ్‌కుమార్ అన్నారు. గౌరవ అధ్యక్షుడు మన్యపురెడ్డి, అధ్యక్షుడు వార్ల విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాపిరెడ్డి, కార్యవర్గ సభ్యులు హన్మంతు, డీకే నాగేశ్వర్, బెజ్జురాములు, బాలకృష్ణగౌడ్, శ్రీకాంత్, మనీ, అభిలను ఎన్నుకున్నారు. అనంతరం సీనియర్ వాలీబాల్ క్రీడాకారులను సన్మానించారు.

వాలీబాల్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్



మద్దూరు: పట్టణ వాలీబాల్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం పట్టణంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్లపు మహేష్, ప్రధాన కార్యదర్శిగా అథిక్, కోశాధికారిగా రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు అనంతసేన, సాయినాథ్, జగదీష్, బాల్‌రాజ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ పట్టణంలో యువతకు వాలీబాల్ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు మహేందర్, రవిపాల్, రమేష్, ఇక్బాల్, రవి, తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా వడ్వాట్- మాగనూర్ రోడ్డు(ఫైల్)



బురదమయంగా ఉన్న నేరడగందొడ్డి రోడ్డు(ఫైల్)



ఉజ్జెల్లి-నేరడగం రోడ్డు (ఫైల్)

రహదారుల్లో బురద!

- అవస్థలతో ప్రయాణం
- బైక్ కూడా వెళ్లలేని దుస్థితి
- బీటీ రోడ్లు నిర్మించాలని డిమాండ్

మాగనూర్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారాయి. మట్టిరోడ్లు ఉండడంతో వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. మండలంలో 9 గ్రామాలకు మట్టిరోడ్లే దిక్కు. వాటితో పాటు వర్కూర్, ఉజ్జెల్లి, నేరడగం, కోల్పూర్, వడ్వాట్, అడవి సత్యారం, మందిపల్లి గ్రామాలకు బీటీ రోడ్డు ఉన్న పూర్తిగా ధ్వంసం కావడంతో మట్టిరోడ్ల కన్న అధ్వానంగా మారాయి. అమ్మపల్లి, పర్మన్‌దొడ్డి, గజ్జరందొడ్డి, పుంజనూర్, ఓబ్లాపూర్, పెగడబండ, అచ్చంపేట, బైరంపల్లి, నేరడగందొడ్డి గ్రామాలకు మట్టి రోడ్లు ఉండటంతో వర్షం పడినప్పుడు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నడవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు బురదలో నడవాల్సిన పరిస్థితి నెలకొంది.

కాలిబాటలే దిక్కు..

గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో మట్టి రోడ్డు ఉన్నా గ్రామస్తులకు కాలిబాటలే దిక్కుగా మారుతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. గ్రామాలకు వెళ్లే దారిలో వాగులు ఉండటంతో రాకపోకలు తెగిపోతున్నాయి.



పెగడబండ రోడ్డు దుస్థితి(ఫైల్)



మాగనూర్-అచ్చంపేట రోడ్డుపై విద్యార్థుల ఇబ్బందులు(ఫైల్)

ఇబ్బంది పడుతున్నాం..



గజ్జరందొడ్డి నుంచి ఇటు మాగనూర్, అటు మక్తల్ ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు మొత్తం పూర్తిగా అధ్వానంగా మారింది. దీంతో కనీసం ద్విచక్ర వాహనాలు తిరగలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, పాలకులు స్పందించి నూతన రోడ్డు ఏర్పాటు చేయాలి.

– వెంకటరెడ్డి, గజ్జరందొడ్డి

వాహనాలు పాడవుతున్నాయి..



మండలలోని పలు గ్రామాలకు రాకపోకలు సాగించాలంటే గుంతల రోడ్డు, బురద రహదారులపై ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో వాహనాలు త్వరగా పాడవుతున్నాయి. ప్రభుత్వాలు ఎన్ని మారినా.. రోడ్డు మాత్రం మారాలే. ఎమ్మెల్యే స్పందించి మండలంలోని రోడ్డు లేని గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేయించాలి.

– దేవ్‌రాజు, పర్మన్‌దొడ్డి

ప్రతిపాదనలు పంపించాం..



మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్డు లేని మాట వాస్తవమే. ప్రధాన మంత్రి సడక్ యోజన్ కింద మండలంలో అవసరమైన చోట నూతన బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతాం.

– మారుతి, పంచాయతీ రాజ్ ఏఈ.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ముదిరాజ్‌లు

కోస్గి రూరల్: ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్‌లోకి మార్చాలని, నియోజకవర్గంలో ముదిరాజ్ భవనాలు మంజూరు చేయాలని ముదిరాజ్ కులస్థులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌కు సూచనలు చేసినట్లు తెలిపారు. చర్యలు చేపట్టాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గంలో ముదిరాజ్ భవనాలను మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. ఇందులో జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, మండల అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, శ్రీకాంత్, చిన్నికృష్ణ, సత్యపాల్, నారాయణ, పకీరప్ప, నర్సింహులు ఉన్నారు.

ఏపీఎం బస్వరాజ్‌కు ఘన సన్మానం



బస్వరాజ్‌ను సన్మానిస్తున్న మిత్రబృందం

కృష్ణా: మండలంలో ఐకేపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎం బస్వరాజ్‌కు ఇటీవల ఉత్తమ సీసీగా అవార్డు రావడంతో ఆదివారం మండల కేంద్రంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ఆయన మిత్రబృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళా సంఘాల బలోపేతంతో పాటు విధి నిర్వహణలో ఆయన నిక్కచ్చిగా వ్యవహరిస్తూ ప్రజలందరి మన్ననలు పొందాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నరేందర్, రాఘవేంద్ర, సుభాష్, గోపాల్, నర్సింహ పాల్గొన్నారు.

మార్వాడీలపై చర్యలు తీసుకోవాలి

మద్దూరు: హైదరాబాద్‌లో మోండా మార్కెట్‌లో దళితుడైన సాయికిరణ్‌ను కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడమే కాకుండా, అడ్డొచ్చిన వారిపై దాడి చేసిన మార్వాడిపై ప్రభుత్వం వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మద్దూరులో దళిత, ప్రజా సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రవీణ్‌కుమార్, చిన్నయ్య, పొన్నయ్య, కృష్ణ, రాజు, మోహన్, సాయిలు, గోవిందు ఉన్నారు.

ప్రజల అస్తిత్వ పరిరక్షణే జాగృతి లక్ష్యం



జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవితకు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాస్

నారాయణపేట: తెలంగాణ చారిత్రక, వారసత్వ అస్తిత్వ పరిరక్షణే జాగృతి లక్ష్యమని నారాయణపేట జిల్లా జాగృతి నూతన అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తనను జాగృతి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవితను కలిసి పూలబొకే అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ జాగృతి 18 ఏళ్లుగా అనునిత్యం ప్రజల కోణంలో, ప్రజల కోసం పని చేస్తుందన్నారు. తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించిన కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

తీగల బంధం వీడుతుందా?



మాగనూర్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఎన్‌హెచ్-167 ప్రధాన రహదారి సమీపంలో గల విద్యుత్ స్తంభానికి ఆకులతో కూడిన తీగలు అల్లుకుంటున్నాయి. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని అన్నదాతలు వాపోయారు. అధికారులు స్పందించి గడ్డి తీగలను తొలగించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుడు అదృశ్యం



ఆత్మకూర్: మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు వడ్ల వెంకటరమణా చారి కనిపించకుండా పోయాడని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరేందర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం రాచాల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు రమణాచారి కుటుంబంతో కలిసి మూలమల్ల గ్రామంలో నివాసముంటున్నారు. ఈ నెల 9న ఆత్మకూర్‌లో బ్యాంకు కు వెళ్లి వస్తానని చెప్పి నేటి వరకు రాకపోవడంతో బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం భార్య ఫిర్యాదు చేసినట్లు వివరించా రు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కనకాద్రి స్వామి హుండీ లెక్కింపు



నారాయణపేట రూరల్: మండలంలోని అభంగాపూర్ గ్రామ పంచాయతీ శివారు నెములపల్లి గుట్టపై వెలసిన కనకాద్రి స్వామి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి శనివారం సందర్భంగా రెండు రోజులుగా జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామి వారి హుండీ లెక్కింపు గ్రామ పెద్దలు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించ గా, రూ.2లక్షల 6వేలు వచ్చాయి. ఎండోమెంట్స్ అధికారి ప్రసాద్, సూపర్‌వైజర్ పృథ్వీరాజ్, పెద్దలు ముకుంద్, నర్సింహులు, చెన్నప్ప పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర కిట్ల పంపిణీ



మరికల్: మండలంలోని రాకొండ గ్రామంలో గూంజ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు ఉచితంగా నిత్యవసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి నరహరి మాట్లాడు తూ తమ సంస్థ ద్వారా పేదలను గుర్తించి నిత్యవస ర సరుకులతో పాటు దుస్తులను అందిస్తామన్నారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాజు, మల్లేష్, వెంకటయ్య, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

చెరువును సందర్శించిన శివకుమార్‌రెడ్డి

నారాయణపేట టౌన్: నారాయణపేట పట్టణ శివారులో ఉన్న కొండారెడ్డిపల్లి చెరువు ఆదివారం మాజీ డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శివకుమార్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం గంగ మ్మ తల్లికి పూజలు చేసి మాట్లాడారు. కొన్ని రోజు లుగా కురుస్తున్న వర్షాలతో చెరువు నిండి అలుగు పారుతోందన్నారు. ఆయకట్టు రైతులకు పంటలు పుష్కలంగా పండుతాయని సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పొలాలకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

మరికల్‌లో రక్తదాన శిబిరం



మరికల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకోవడంతో మరికల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో ఆదివారం మరికల్ ఖండ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కిషన్ శాస్త్రీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఖండ కార్యవాహ సభ్యులు రవికుమార్, ధనంజ య, కొండయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, బాబురావు, రమేష్, రాజేష్, సచిన్, ప్రదీప్, బసంత్, అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



మక్తల్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి



నారాయణపేటలో పూజలు చేస్తున్న మహిళలు



కొల్లంపల్లి లో పూజలు చేస్తున్న భక్తులు

మక్తల్: శ్రీకృష్ణ జన్మష్టమి వేడుకలు సందర్భంగా ఆదివారం మక్తల్ పట్టణంలో శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పాలఉట్ల కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని సన్మానించారు. కార్యక్రమలలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కొండయ్య, శంకరోల్ల రవికుమార్, కట్టసురేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మక్తల్ సీఐ రాంలాల్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నారాయణపేట రూరల్: పట్టణంలో మహేశ్వరి సమాజం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరాఫ్ బజార్‌లోని శ్రీ బాలాజీ ఆలయంలో లడ్డూ గోపాల్‌ను అందంగా అలంకరించారు. హరికిషన్, శ్యామ్, రాజు, ఆనంద్, కైలాష్, హనుమాన్, డా.రౌనక్, ఆశిష్, మాధవ్, మురళి, శ్రీహరి, పవన్, మోహన్, భగవాన్, జగదీష్, హనుమాన్, రిషబ్, వైభవ్, విష్ణుదారక్, అశోక్, గోకుల్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

- విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని కొల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంజీవమూర్తి దేవాలయం ఆవరణలో శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు చేశారు. యువకులు, పిల్లలు ఉట్టి కొట్టి సందడి చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని మందిపల్లిపాతతండాలో శ్రీకృష్ణ దేవుడి జాతర ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. జల్దిబిందెతో తీసుకొచ్చిన పవిత్ర జలంతో స్వామి వారికి అభిషేకించారు. భోగ్ నిర్వహించి తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పాల ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జల్దిబిందె ఊరేగింపు



అంత్వార్‌లో జల్దిబిందె ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



పులిమామిడిలో కలశం శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని అంత్వార్ గ్రామంలో ఆంజనేయస్వామి జల్ది బిందె కార్యక్రమం ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ శివారులోని చెరువు నుంచి ఆలయం వరకు గ్రామ వీధుల గుండా శోభాయాత్రగా తరలి వచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. యువకులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయి కృష్ణ, శేఖర్, పాకాల తిరుపతి, శివ గౌడ్, వెంకటయ్య, ఆనంద్‌గౌడ్, ప్రకాష్, ప్రతాప్, రమేష్, బాబు, రాము, అంజి పాల్గొన్నారు.

ఘనంగా కలశం ఊరేగింపు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో శ్రీరామలింగేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం కలశం శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం నుంచి శోభాయాత్ర చేపట్టి గుట్టపైన రామలింగేశ్వర దేవాలయం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రాణేష్, రఘు, శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేద్దాం



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభలు ఈనెల 25, 26 తేదీల్లో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎదిరింటి రాములు తెలిపారు. మండలంలోని కోటకొండలో ఆదివారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందని విమర్శించారు. సభను విజయవంతం చేయడానికి జిల్లాలోని ప్రజాసంఘ వాదులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వెంకటరాములు, అబ్దుల్ రెహ్మాన్, దామోదర్, రఫిక్ పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజించాలి



మట్టి గణపతులను అందజేస్తున్న నాయకులు

మరికల్: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ కృష్ణయ్య, తీలేర్ మాజీ సర్పంచ్ రేవంతమ్మ, అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మట్టి విగ్రహాలను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి గణపతి విగ్రహాల వల్ల పర్యావరణం కాపాడుకునే అవకాశం ఉందన్నారు. రసాయన రంగులు కలిసిన గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయడంలో అవి నీటిలో కలిసి పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో రాజు, ఆంజనేయులు, రాములు, మొగులయ్య, బజారప్ప పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్దూరు: పట్టణానికి చెందిన మహమ్మద్ ఖాజామియా(60) ఈ నెల 14న ఫిట్స్ రావడంతో కింద పడిపోగా దెబ్బలు తగిలాయి. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఖాజామియా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతిని కుమారుడు మహమ్మద్ దౌలత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు అప్పగించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పాము కాటుతో కాడెద్దు మృత్యువాత

దామరగిద్ద: మోతకు వదిలిన కాడెద్దు గంటల వ్యవధిలోనే విగతజీవిగా మారిన సంఘటన ఆదివారం మండలంలోని మద్దెల్‌బీడ్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన రైతు చింతచెట్టు మాదవరెడ్డి ఉదయం తన పొలం గెట్టుకు బారి తాడుతో కాడెద్దులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి పొలానికి వచ్చి చూడగా ఓ కాడెద్దు నురుగు కక్కుతూ మృత్యువాత పడింది. పాముకాటుకు గురైనట్లు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశాడు. రైతుకు న్యాయం చేయాలని నాయకులు కోరుతున్నారు.

దారికి అడ్డంగా వాహనాల పార్కింగ్

మాగనూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం ముఖద్వారం ఎదుట వాహనాలను ఇష్టానుసారంగా నిలపడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఒకేచోట నాలుగుకు పైగా ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో దారికి అడ్డుగా వాహనాల పార్కింగ్‌తో అటు అధికారులు, ఇటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

